| S.No. | Title of the article/Journal | News paper | Date of publication | Discussed with class | Related to course/topic | Remarks |
|---|---|---|---|---|---|---|
| ① | ప్రణాళికా సంఘం.. పోతే మరేదంటే | ఈనాడు / Eenadu | 25/06/2014 | BA - IV Sem | NITI Aayog & planning comision | |
| ② | తీవ్ర దారిద్ర్యానికి చరమాంకం | ఈనాడు / Eenadu | 13/07/2015 | BA VI Sem & IV sem | Indian Economic Development | |
| ③ | నైపుణ్యాలు లేకనే నిరుద్యోగ భారతం | Eenadu / ఈనాడు | 02/12/2015 | BA IV & VI Sem | Human Resource Development - Unemployment | |
| ④ | స్వేచ్ఛా విపణే వ్యవసాయ సంస్కరణ | ఈనాడు / Eenadu | 19/01/2019 | BA IV sem | Agricultural development | |
| ⑤ | నవ కల్పనలతోనే నవ భారతం | ఈనాడు / Eenadu | 13/02/2020 | BA VI Sem | Innovation & Development | |
| ⑥ | నాణ్యమైన బోధనా సంస్థలు | ఈనాడు / Eenadu | 30/01/2019 | BA VI Sem | Human Resource Development & Higher Education | |
| ⑦ | Removing the roots of farmers' distress | The Hindu | 28/01/2019 | BA IV Sem | Indian Economy - Agriculture Sector | |
| ⑧ | ఆహారశుద్ధి పరిశ్రమలు - food processing opportunities | ఈనాడు / Eenadu | 10/01/2019 | BA IV Sem | Indian Economy Agricultural reforms | |
| ⑨ | సాగుదారులకు అండగా 'ఈ-నామ్' | ఈనాడు / Eenadu | 14/03/2019 | BA IV Sem | Agricultural marketing | |
| ⑩ | The ambiguity of reservations for the poor | The Hindu | 22/01/2019 | BA VI Sem | Development Economics | |
| ⑪ | చిన్న పరిశ్రమలకు పెద్ద దెబ్బ | ఈనాడు / Eenadu | 17/01/2019 | BA IV Sem | Small scale industries | |
| ⑫ | జనాభా పెరుగుదల సవాళ్లు - భారత్ పై భవిష్యత్తు | ఈనాడు / Eenadu | | BA IV Sem | Population of India | |
| ⑬ | తెలంగాణ బడ్జెట్ | ఈనాడు / Eenadu | 09/03/2020 | BA VI Sem | Budget preparation | |

# స్వేచ్ఛా విపణే సిసలైన సంస్కరణ

## మార్కెట్ రూపాంతరీకరణ నేటి అవసరం



ఎస్.మహేంద్ర దేవ్

భారతదేశం తన 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని 2022లో జరుపుకొంటుంది. అప్పటికి మన వ్యవసాయాన్ని రూపాంతరం చెందించి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి నీతి ఆయోగ్ ఒక వ్యూహ పత్రాన్ని వెలువరించింది. ఇటీవల కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రైతుల ఆగ్రహ సెగ తగిలి భారతీయ జనతాపార్టీ ఓడిపోవడంతో ఈ వ్యూహాన్ని తప్పక అమలు చేయాల్సిన అవసరం ఎన్డీయేకు తన్నుకొస్తోంది. నీతి ఆయోగ్ పత్రం మూడు వ్యూహాలను సూచించింది. 1. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి పంటల వైవిధ్యాన్ని, ఉత్పాదకతను పెంచడం 2. పూర్తిగా వ్యవసాయం మీదనే దృష్టి కేంద్రీకరించకుండా ప్రైవేటు భాగస్వామ్యంతో వ్యావసాయిక వ్యాపారాలను ప్రోత్సహించడం. చిన్న, మధ్యతరహా రైతులు వ్యవసాయ వ్యవస్థాపకులుగా మారడానికి తోడ్పడటం. 3. గ్రామాల్లో ఆధునిక మౌలిక వసతులు నిర్మించి, వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువ జోడించడానికి ఆహార శుద్ధి పరిశ్రమలను విస్తరించడం, తద్వారా వ్యవసాయ ఎగుమతులను భారీగా పెంచడం! లక్ష్యాలు బాగున్నా ఈ త్రిముఖ వ్యూహంలో కొంత అస్పష్టత ఉంది. వ్యవసాయ ఉత్పత్తి వ్యయం, ధరల సంఘం (సీఏపీసీ) స్థానంలో రాజ్యాంగంలోని 323 బి అధికరణ కింద వ్యవసాయ ట్రిబ్యునల్‌ను ఏర్పరచాలని వ్యూహ పత్రం సూచించింది. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు బదులు కనీస రిజర్వు ధర (ఎంఆర్పీ)ను ప్రవేశపెట్టాలన్నది ఆ సూచన. మండీల్లో వేలాలకు ఎంఆర్పీ ప్రారంభ ధర కావాలని సూచించింది. ఈ అంశాలపై పత్రంలో తగినంత స్పష్టత లేకపోవడం పెద్ద లోటు.

### మెరుగైన ధరలకు మార్గం

మెరుగైన మార్కెట్లు ఏర్పడి వాటిలో రైతులు స్వేచ్ఛగా విక్రయాలు జరుపుకొనే పరిస్థితి నెలకొంటే పంటలకు అధిక ధరలు లభించి రైతు ఆదాయం రెట్టింపవుతుంది. కానీ, గడచిన 70 ఏళ్ల నుంచి రైతులకు గిట్టుబాటు ధరలే లభించనప్పుడు వారి ఆదాయాలు పెరగడమెలా సాధ్యం? విత్తనాలు, ఎరువుల వంటి ఉత్పత్తి సాధనాలపై రైతు చేసిన వ్యయానికి కుటుంబ సభ్యుల శ్రమ విలువను జోడించగా వచ్చే ధరకన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ ధరను కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయిస్తోంది. నిజానికి భారతీయ రైతుకు ఎంఎస్పీ, సబ్సిడీలు ఇస్తున్నా సక్రమంగా పంట సేకరణ జరగనిదే ప్రయోజనం ఉండదు. రైతుకు గిట్టుబాటు ధర చెల్లించడానికి 2018 కేంద్ర బడ్జెట్‌లో ప్రధానమంత్రి అన్నదాత ఆయ సంరక్షణ పథకం ప్రవేశపెట్టారు. మద్దతు ధర, విపణి ధరకూ మద్దతు ధరకూ మధ్య వ్యత్యాసం, ప్రైవేటుగా పంట సేకరణ, నిల్వ పథకం అనే మూడు అంశాలతో రూపొందిన ఆయ సంరక్షణ అభియాన్ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.

పైన చెప్పుకొన్న పథకాలకన్నా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకం వెయ్యి రెట్లు మేలు. తెలంగాణలో సంవత్సరానికి రెండుసార్లు (ఖరీఫ్, రబీ సీజన్లలో) 58.3 లక్షల మంది రైతులకు తలా రూ.4,000 చొప్పున పెట్టుబడి సాయం అందుతోంది. అంటే ప్రతి రైతుకు ఏడాదికి రూ.8,000 చొప్పున లభిస్తోందన్నమాట. ఇకపై ఏటా రూ.10,000 చొప్పున చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఒడిశా సైతం ప్రస్తుత సీజను నుంచి రూ.5,000 చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. రెండు సీజన్లకు రూ.10,000 చొప్పున అందనుంది. ఆ రాష్ట్రంలో మొత్తం 30.2 లక్షలమంది రైతులకు ఈ విధమైన చెల్లింపులు జరపడానికి రూ.3,016 కోట్లు కేటాయించారు. చిన్న, మధ్యతరహా రైతులకు సాగు పెట్టుబడి కింద ఈ సొమ్ము అందిస్తారు. ఇంకా 10 లక్షల భూమిలేని కుటుంబాలకు వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో జీవనాధారం కోసం కుటుంబానికి రూ.12,500 చెల్లిస్తారు. ఏటా రూ.1,250 కోట్లు ...

రూ.10,000 చొప్పున చెల్లించడానికి రూ.500 కోట్లు కేటాయించారు. తెలంగాణ, ఒడిశా పథకాలు ఎంతో ఆచరణీయంగా, ప్రయోజనకరంగా ఉండటంతో ఇతర రాష్ట్రాలూ ఈ తరహా నగదు బదిలీ పథకాలను ఆదర్శంగా తీసుకోవచ్చు. అయితే దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పంటలకు సుస్థిర ఏకీకృత జాతీయ విపణిని ఏర్పాటు చేయడం ఉత్తమ పరిష్కారమవుతుంది. దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. వ్యావసాయిక ఎగుమతుల వృద్ధికి అనువైన విధానాల రూపకల్పన సులువు అవుతుంది. కానీ, భారత్‌లో ఇంతవరకు చేపట్టిన వ్యవసాయ విపణి సంస్కరణలు చాలా పరిమితం. ఇవి దళారుల పాత్రను తగ్గించలేకపోవడం శోచనీయం. విపణి గొలుసులు, భౌతిక కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో వృద్ధి చెందలేదు. అందుకే కొన్నిసార్లు వినియోగదారులు కిలో టమాటాకు రూ.40 చెల్లిస్తున్నా రైతుకు కిలోకు ఒక్క రూపాయే అందుతోంది. వ్యవసాయ విపణులను సంస్కరించడం ద్వారా ఇలాంటి సమస్యలను పరిష్కరించవచ్చు కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కారణాలవల్ల సంస్కరణలను చేపట్టలేకపోతున్నాయి. జాతీయ వ్యవసాయ విపణి సృష్టికి కేంద్రం ఇ-నామ్ వేదికను సృష్టించాలని తలపెట్టినా, ఆ దిశగా పెద్ద పురోగతి లేదు. ఏ రకంగానైతేనేం రైతు తన ఉత్పత్తిని గిట్టుబాటు ధరకు అమ్ముకునే స్వేచ్ఛ ఉంటేనే వ్యవసాయం వర్ధిల్లుతుంది.

వ్యవసాయ విపణి సంస్కరణలకు కర్ణాటక అనుభవం ఉపయోగపడుతుంది. ఈ తరహా సంస్కరణలకు నియమ నిబంధనలను రూపొందించి అమలుచేసే సంస్థాగత ఏర్పాట్లు ఉండాలి. వ్యవసాయదారులు విపణుల్లో స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించగలగాలి. ఆధునిక వ్యాపార నిర్వహణకు తగిన వేదికలు కల్పించాలి. ఈ మూడు పనులు జరగనిదే విపణి సంస్కరణలు విజయవంతం కావు. ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రధానంగా వరి, గోధుమలకు వర్తింపజేస్తూ మిగతా పంటలపై శీతకన్ను వేయడం పెద్ద లోపం. ఈ మద్దతు ధరలు కూడా కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే చెల్లిస్తున్నారు. చిరు ధాన్యాలు, పప్పు గింజలు, పండ్లు, కూరగాయలు, చేపలు, పాడి ఉత్పత్తులకూ మద్దతు ధరలు ఇవ్వాలి. పంటల వైవిధ్యంతో రైతుల ఆదాయాలు పెరగడంతోపాటు పర్యావరణ సంరక్షణా సిద్ధిస్తుంది. దేశంలోపల వ్యవసాయోత్పత్తుల వ్యాపారాన్ని మరీ ఎక్కువగా నియంత్రించినా, భూకమతాలు, ఆహార శుద్ధి పరిశ్రమల పరిమాణం, రుణ విపణి మీద అతిగా పరిమితులు విధించినా ప్రైవేటు పెట్టుబడులు ముందుకురావు. వ్యవసాయం, గిడ్డంగులు, సరకుల బట్వాడా, ఆహార శుద్ధి, మార్కెటింగ్, చిల్లర వర్తకం ఒకే గొలుసులా అభివృద్ధి చెందినప్పుడే సేద్యంలో విప్లవాత్మక మార్పు సిద్ధిస్తుంది. వ్యవసాయ ఎగుమతులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. మరో రకంగా చెప్పాలంటే సేద్యంలో గొలుసు అనేది పంట ఉత్పత్తితో మొదలై ఆహార శుద్ధితో ముగుస్తుంది. కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాల్లో గిడ్డంగులు, ఆహార శుద్ధి, వ్యవసాయ టోకు, చిల్లర వర్తకాలు సరిగ్గా అభివృద్ధి చెందకపోవడంతో వ్యవసాయ గొలుసు సమర్థ ఫలితాలను ఇవ్వలేకపోతోంది. ప్రైవేటురంగ భాగస్వామ్యంతో పరిస్థితి మెరుగుపడుతుంది.

### ఎగుమతి విధానాల అండ

భారతదేశ వ్యవసాయ ఎగుమతులను ప్రస్తుత 3,000 కోట్ల డాలర్ల నుంచి 2022కల్లా 6,000 కోట్ల డాలర్లకు పెంచాలన్నా, అప్పటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నా సమర్థమైన జాతీయ ఎగుమతుల విధానాన్ని రూపొందించడం ముఖ్యం. కానీ, మన ప్రభుత్వం ఇంతవరకు దీర్ఘకాలిక వ్యూహాన్ని సిద్ధం చేయకపోవడం శోచనీయం. పైగా చీటికిమాటికి వ్యవసాయ ఎగుమతులపై నిషేధాలు విధిస్తోంది. ఉల్లి, పప్పు గింజల ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారులకు నష్టం కలగకూడదని ఆ పంటల ఎగుమతిని నిషేధించే ప్రభుత్వం, అది రైతులకు నష్టదాయకమని గ్రహించడంలేదు. ఆకస్మిక నిర్ణయాలు కాకుండా స్థిరమైన కార్యాచరణకు పట్టం కట్టే దీర్ఘకాలిక ఎగుమతి విధానాన్ని ఇకనైనా రూపొందించాలి. పల్లె ప్రజలకు ఆరోగ్య బీమా కల్పించాలి, విద్యా వసతులు విస్తరించాలి. గ్రామీణులకు కనీస ఆదాయం లభించేలా తగు విధానాలు రూపొందించాలి. భూతాపాన్ని తట్టుకుని నిలిచే వంగడాలను రూపొందించి రైతులకు అందించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి. తక్కువ ఉత్పత్తి సాధనాలు, వనరులతో ఎక్కువ దిగుబడి సాధించే నవ్యరీతులను నేర్పాలి. ప్రకృతికి భంగం కలిగించకుండా సేద్యం చేయడం, జీరో బడ్జెట్ సహజ వ్యవసాయం వంటి నూతన వ్యవసాయ విధానాలతో వాతావరణ మార్పులను అధిగమించి దిగుబడి పెంచాలి. ఒప్పంద సేద్యాన్ని ప్రోత్సహించడం, కేరళలో మాదిరిగా కుటుంబశ్రీ మహిళా సంఘాలను, స్వయంసహాయక సంఘాలను పటిష్ఠపరచడం, రైతు సమాఖ్యల ఏర్పాటు, కాల్వలు, భూగర్భ జలాలను సమర్థంగా ఉపయోగించి ఎక్కువ ఉత్పాదకత సాధించడం వంటివి చేపట్టాలి. ఇందుకు సంబంధించిన సంస్థలను బలోపేతం చేయాలి. నీతి ఆయోగ్ వ్యూహ పత్రం లక్షించినట్లు రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడంతోపాటు అన్ని వర్గాలూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలి. నిలకడగా సమ్మిళిత అభివృద్ధి సాధించాలి. రుణమాఫీలు తాత్కాలిక ప్రయోజనాని...




### ఆదాయానికి అదనపు మార్గాలు



మన గ్రామాలు, పట్టణాలు వేగంగా రూపాంతరం చెందుతున్న దృష్ట్యా వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలు రెండూ అభివృద్ధి చెందితేనే సమగ్ర, సుస్థిర ప్రగతి సాధ్యపడుతుంది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావాలన్నా ఇది కీలకం. వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టి గ్రామీణులకు జీవనాధారం ఏర్పరుస్తూనే క్రమంగా పల్లె జనాన్ని వ్యవసాయేతర రంగాలకు తరలించాలి. వర్షాభావ ప్రాంతాల్లో సన్నకారు, చిన్నకారు రైతులు, మహిళలు, ...

# నవకల్పనలతోనే నయా భారతం



పి.వి.రావు



భారత్‌లో నవకల్పనలకు కొరతేమీ లేదు. ఈ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు రెండింటిదీ ఆశాజనక ప్రస్థానమే. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే మాత్రం మనదేశం కొంత వెనకబడే ఉంది. ప్రపంచ నవీకరణల్లో వివిధ దేశాల ప్రభావంపై అమెరికా మేధాసంస్థ 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఐటీఐఎఫ్)' ఇటీవల ఓ అధ్యయనం చేపట్టింది. దాని ప్రకారం మొత్తం 56 దేశాల జాబితాలో భారత్ దాదాపు అట్టడుగున నిలిచింది. దేశంలోని మేధా సంపత్తి చట్టాలు, ఎగుమతి రాయితీలు, సేవారంగంలోని మార్కెట్ల వంటివి ఈ పరిణామానికి కారణమని తెలుస్తోంది. మానవ మూలధనాన్ని అభివృద్ధి చేసే విషయంలో పేలవ పనితీరు కూడా ర్యాంకుల్లో వెనకబాటుకు కారణమైనట్లు ఐటీఐఎఫ్ ఉపసూచీల అధ్యయనం స్పష్టీకరిస్తోంది. ప్రాథమిక, మాధ్యమిక స్థాయి విద్యలో ఒక్కో విద్యార్థిపై దేశం పెడుతున్న సగటు ఖర్చులోనూ భారత్ అట్టడుగున ఉంది. ఒక్కో విద్యార్థిపై కేవలం రూ.88,600 వ్యయీకరిస్తూ- కొలంబియా, వియత్నాం వంటి దేశాలకన్నా వెనకంజ వేసింది. ఉన్నత విద్య పరంగానూ మనదేశ పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదు. విశ్వవిద్యాలయ పరిశోధనలపై తలసరిన ప్రభుత్వం అందజేస్తున్న నిధులూ అంతంతమాత్రమే. ఇక్కడా భారత్‌ది చివరిస్థానమే. దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాలు మనకన్నా మెరుగ్గా ఉన్నాయి. ఉన్నత విద్యలో పెట్టుబడులు తక్కువగా పెడుతున్నారంటే, పరిశోధనల పరంగా భారత్ కృషి అంతంతమాత్రంగా ఉన్నట్లుగా భావించాలి. ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగుల్లో వర్సిటీలు చేపట్టిన నాణ్యమైన పరిశోధనల్నే పరిగణనలోకి తీసుకున్నారు. దేశంలోని చాలా వర్సిటీలు పరిశోధనలపై దృష్టి సారించడం లేదు. దీనివల్ల అంతర్జాతీయ ర్యాంకుల్లో అవి బోధన దుకాణాల స్థాయికి దిగజారిపోతున్నాయి. ఐటీఐఎఫ్ నివేదిక ప్రకారం- ఒక దేశంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల సంఖ్యాపరంగా, 51 దేశాల జాబితాలో భారత్ 35వ స్థానంలో నిలిచింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి 800 వర్సిటీల్లో 17 మాత్రమే భారత్‌లో ఉండటం ఇందుకు కారణమనేది సుస్పష్టం.

## అవకాశాలు అపారం

భారత వర్సిటీల్లో మెరుగైన పరిశోధన సౌకర్యాలు లేకపోవచ్చు. అదేసమయంలో ఐఐఎస్‌సీ, డీఆర్‌డీవో, ఇస్రో వంటి ప్రసిద్ధి చెందిన పరిశోధన సంస్థలు దేశంలో ఉన్నాయి. పరిశోధన-అభివృద్ధిపై ప్రభుత్వం తలసరిన చేసే వ్యయంలోనూ భారత్ ర్యాంకు మధ్యస్తంగా ఉంది. రూ.32,900 తలసరి వ్యయంతో మనదేశం కెన్యా, దక్షిణాఫ్రికాలకన్నా వెనగ్గా ఉంది. ప్రతి లక్షమందికి కేవలం 15 మంది పరిశోధకులే ఉన్నారు. ఫలితంగా ఈ ప్రమాణంలో భారత్ అట్టడుగున ఉన్న అయిదు దేశాల సరసన ఉంది. పరిశోధనల నాణ్యతలోనూ భారత్ పరిస్థితి ఇదే. 'సైటేషన్ల' సంఖ్యలోనూ భారత్ అడుగునున్న ఆరుదేశాల సరసన నిలిచింది. వర్సిటీ ప్రయోగశాలల్లో జరిగే పరిశోధనలను వాణిజ్యపరంగా ప్రైవేటు రంగానికి చేర్చే దిశగా తోడ్పడే సాంకేతికత బదిలీకి మనదేశంలో చట్టపరమైన వెసులుబాటు లేదు. అభివృద్ధి చెందిన దేశాలే కాకుండా, దక్షిణాఫ్రికా, ఇండోనేసియా, బ్రెజిల్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలూ ఈ తరహా చట్టపర సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. దీనివల్ల లైసెన్సులు, ఆర్థికంగా లాభదాయక నవకల్పనల్ని వాణిజ్య మార్కెట్‌కు తరలించడం తేలికవుతుంది. నవకల్పనలకు ప్రోత్సాహం కల్పించాలనే విధానాన్ని పాటించే ఏ దేశమైనా, ప్రపంచవ్యాప్తంగా వాటిని పెంపొందించేందుకు కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో నవకల్పనల్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన 'స్టార్టప్ ఇండియా' వంటి కార్యక్రమాలు స్వల్పకాలంలో ప్రేరణ అందించేవే. అంకుర పరిశ్రమల్లో పెట్టే పన్నుచెల్లింపుదారుల సొమ్ము స్వల్పకాలంలోనే ఉద్యోగాలు కల్పించే దిశగా తోడ్పడుతుందనడంలో సందేహం లేదు.

## పరిశోధనలకు మరిన్ని పెట్టుబడులు

**నవకల్పనల్ని ప్రోత్సహించడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లయితే మున్ముందుగా ఉన్నత విద్యలో పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వాలి. నవకల్పనల్లో దేశం వెనకబాటుకు అసలు కారణం ప్రాథమిక, మాధ్యమిక విద్యపై అత్యంత తక్కువ నిధుల్ని మనదేశం వ్యయం చేయడమే!**

ప్రైవేటు రంగం సాయంతో జీడీపీలో పరిశోధన- అభివృద్ధిపై వ్యయాల్ని రెండు శాతానికి పెంచాలనే లక్ష్యంతో పలు విజ్ఞానశాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన, నవకల్పనల విధానాల్ని ప్రకటించినా అవేవీ ఆచరణకు నోచుకోలేదు. విశ్వ నవకల్పనల సూచీ (జీఐఐ) ప్రకారం, వాణిజ్యపరమైన పరిశోధన-అభివృద్ధి విభాగంలో భారత్ 2013లో 42వ స్థానంలో ఉండగా, 2019నాటికి 49వ స్థానానికి దిగజారింది. స్థూల ఆర్‌అండ్‌డీ వ్యయాల్లో ప్రైవేటురంగం ఖర్చు సగానికన్నా తక్కువగానే ఉంది. జీఐఐలో మంచి పనితీరు కనబరుస్తున్న ఇతర దేశాలతో పోలిస్తే, ఇది తక్కువే. ఈ రంగంలో దీటుగా రాణించాలంటే ముందుగా నవకల్పనలపై జాతీయ స్థాయిలో ఒక దార్శనిక ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రభుత్వం, ప్రైవేటురంగం, విద్యాసంస్థల మధ్య విజయవంతమైన సహకారం నెలకొన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. విజయవంతమైన నవకల్పనల గమ్యస్థానాలుగా తమను తాము తీర్చిదిద్దుకున్న ఫిన్లాండ్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సమష్టి జాతీయ దార్శనిక ప్రణాళిక, వ్యూహం కీలకమని రుజువు చేశాయి. జాతీయ స్థాయిలో దార్శనిక ప్రణాళికలు లేకుండానే భారత ఐటీ రంగంలో ప్రాథమికంగా నవకల్పనలు ప్రాణం పోసుకున్నాయి. ప్రస్తుత కాలంలో ఇది అంత సరైన వ్యూహం కాదు. ఈ క్రమంలో నీతిఆయోగ్ అటల్ నవకల్పనల మిషన్‌కు రూపకల్పన చేయడం బాగానే ఉన్నా, నవకల్పనల కోసం ఒక జాతీయ స్థాయి సమన్వయ వ్యూహం రూపుదిద్దుకొనకపోవడం బాధాకరం. ఏ సంస్థలకు, రంగాలకు సహాయ సహకారాలు అందించాలనే దానిపై నిర్ణయాన్ని 'ప్రైవేట్ వెంచర్ క్యాపిటల్ సంస్థల విచక్షణకు విడిచిపెట్టడం భారత్‌కు సంబంధించి ఉత్తమ విధానం కాదు. నవకల్పనలు సాధించాల్సిన రంగాల్ని, సమస్యలకు పరిష్కారం గుర్తించే విషయంలో ప్రభుత్వం- పరిశ్రమలు, విద్యావేత్తల భాగస్వామ్య సహకారాలను తీసుకోవాలి. ప్రభుత్వం ఆరోగ్యం నుంచి పారిశుద్ధ్యం వరకు, రవాణా నుంచి పర్యావరణం వరకు విభిన్న రంగాలపై నవకల్పనల కోసం దృష్టి సారించాల్సి ఉంది. కొన్ని నిర్దిష్ట రంగాల్ని ఎంచుకొని వనరుల్ని సేకరించి, విజ్ఞాన బదిలీని జరపడం ద్వారా విజయం ఎలా సాధించవచ్చో చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు ప్రపంచానికి చూపాయి. ఇదంతా చేయడం అంత తేలికైన పనేమీ కాదు. ఎప్పటికప్పుడు అందుబాటులోకి వచ్చే కొత్త సాంకేతిక పరిజ్ఞానాల్ని అందిపుచ్చుకొంటూ, నవకల్పనల దిశగా సాగే విషయంలో పరిస్థితి మరింత మెరుగుపడాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాల్లో మేధాసంపత్తిపై పెట్టుబడులు పెంచాలి. అగ్రశ్రేణి సంస్థల భాగస్వామ్యంతో చక్కని నవకల్పనల వాతావరణాన్ని రూపొందించాలి.

## ప్రోత్సాహకాలు అవసరం

వ్యాపార నిర్వహణ, నవకల్పనలకు ఒకదానికొకటి సంబంధం ఉన్నా, రెండూ ఒకటి కాదన్న సంగతి గుర్తించడం ముఖ్యం. వ్యాపారవేత్తలందరికీ నవకల్పనల్లో ఆసక్తి ఉండదు. ఉద్యోగ కల్పన, స్వయంఉపాధిని ప్రోత్సహించేందుకు వ్యాపార నిర్వహణను ప్రోత్సహించడం ముఖ్యమన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గణనీయమైన నవకల్పనలు ప్రస్తుతం ఉండే కంపెనీల్లోనే జరుగుతాయన్న సంగతి అందరూ గుర్తుంచుకోవాలి. ఆర్థిక వ్యవస్థలోని ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో నవకల్పనల్ని ప్రోత్సహించడం ముఖ్యం. ముఖ్యంగా ఆయా కంపెనీలు ప్రపంచస్థాయిలో పోటీ పడటానికి ఇదెంతో అవసరం. సులభతర వాణిజ్యం అంశంలో ప్రపంచబ్యాంకు ర్యాంకుల్లో భారత్ పనితీరు పేలవం. వ్యాపార వ్యవహారాల్ని సరళతరంగా మార్చడంలో భాగంగా, ఈ సమస్యను సరిదిద్దే విషయంలో దృఢసంకల్పంతో వ్యవహరించాలి. పరిశోధన-అభివృద్ధి విభాగాలపై పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అగ్రస్థాయి పరిశోధక విశ్వవిద్యాలయాలతో ఒప్పందాల్ని చేసుకునే సంస్థల్ని ప్రోత్సహించాలి. ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు నవకల్పనలకు వ్యూహాత్మక ప్రాధాన్యం ఇచ్చేలా స్థిరమైన ప్రయత్నాలు సాగాలి. చివరగా డిజిటల్ పరివర్తన, నవకల్పనలకు ప్రభుత్వం తనకు తానే ఒక ఉదాహరణలా నిలవాలి. ప్రభుత్వ సేవలు గ్రామాల నుంచి నగరాల వరకు కోట్లమందికి చేరతాయి. డిజిటల్ సాంకేతికతను అందిపుచ్చుకోవడం, రీడిజైన్ ప్రక్రియల ద్వారా ప్రభుత్వం ఖర్చుల్ని తగ్గించుకోవడం, కీలకమైన వృద్ధి రంగాల్లో పెట్టుబడులు పెట్టే సామర్థ్యాల్ని పెంపొందింపజేయడం వంటి అంశాల ద్వారా ప్రభుత్వం భారతీయులందరి జీవన నాణ్యతను మెరుగుపరచవచ్చు. మనమిప్పుడు నాలుగో పారిశ్రామిక విప్లవ దశలో ఉన్నాం. ఆర్థికవ్యవస్థలోని అన్ని రంగాలు, అందరి జీవితాలు రాబోయే సంవత్సరాల్లో గణనీయ రీతిలో మార్పు చెందేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ విషయంలో భారత్‌కూ ప్రత్యేక అవకాశాలున్నాయి.



## పరిమితుల చట్రంలో ప్రతిభ

ఒకట్రెండు దశాబ్దాల్లో భారత విజ్ఞానశాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగం పలురెట్లు విస్తరించింది. దేశంలో పెద్దసంఖ్యలో శాస్త్రవేత్తలు ఉద్భవించారు. అయినా స్వాతంత్ర్యం వచ్చాక విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని భారత్ సాధించలేకపోయింది. అంతటి స్థాయిగల 'ఊల్ఫ్ ప్రైజ్'నూ ఏ భారతీయుడూ సాధించలేకపోయారు. 'మిలీనియం టెక్నాలజీ ప్రైజ్' సైతం ఒక్కరికీ రాలేదు. ప్రపంచంలోని అగ్రశ్రేణి 200 విద్యాసంస్థల్లో భారత్‌కు చోటే దక్కలేదు. అమెరికాలో చాలా వర్సిటీలకు విరాళాల ద్వారా నిధులు సమకూరుతాయి. మనదేశంలో ఈ ప్రక్రియ శైశవదశలోనే ఉంది. దశాబ్దం క్రితం దాకా భారత విజ్ఞానశాస్త్ర విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు చాలా తక్కువే. కొన్నేళ్లుగా పరిస్థితిలో మార్పు వచ్చింది. దేశ విద్యాసంస్థల్లో ప్రతిభను గుర్తించే వ్యవస్థలు సాంకేతికత అభివృద్ధికన్నా శాస్త్ర అంశాల ప్రచురణలపైనే ఎక్కువగా దృష్టి సారించాయి. ఇలాంటి పరిమితులవల్ల భారత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన గణనీయ విజయాలు విస్మరణకు గురయ్యాయనేది కొంతమంది సీనియర్ శాస్త్రవేత్తల భావన. నవకల్పనల వైపు యువతను నడిపించడంలో అనువైన పరిస్థితులు దేశంలో లేవన్నది చేదునిజం.

(రచయిత- ఆర్థిక, సామాజిక విశ్లేషకులు)